


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY










PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 22-01-2026 సంపుటి : 07 సంచిక 250 పేజీలు : 8 వెల : రూ 3-00


## గ్రీన్ అమ్మోనియా కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టండి: మంత్రి లోకేశ్



దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ దేశాలకు చెందిన వ్యాపార వేత్తలు, సీఈఓలతో భేటీ అవుతూ ఏపీ మంత్రి నారా లోకేశ్‌బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా.. జపాన్‌కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో అండ్ ఛైర్మన్ యుకియో కానితో మంత్రి లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఏపీలోని గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు లోకేశ్.జపాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉపయోగించుకుని సమీపంలోని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేశారు లోకేశ్. పారిశ్రామిక వినియోగదారులకు దృఢమైన క్లీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి రాయలసీమలో సౌర-పవన హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని వెల్లడించారు.జపాన్ భవిష్యత్తు క్లీన్ ఇంధన దిగుమతులకు మద్దతు ఇవ్వడానికి భారత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వాల్యూ చైన్లను ఏర్పాటు చేయాలని జెరా సంస్థ నిర్ణయించుకుంది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌తో భాగస్వామ్యం ద్వారా యుటిలిటీ-స్కేల్ పునరుత్పాదక శక్తి తయారీలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు జెరా సీఈవో యుకియో వెల్లడించారు.

# ఏపీని గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతున్నాం: సీఎం చంద్రబాబు



దావోస్, జనవరి 21: ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుమూడో రోజు బిజీ బిజీగా గడిపారు. ఈ పర్యటనలో భాగంగా చంద్రబాబుతో వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు సంభాషించారు. టైమ్ మీడియా ప్రతినిధి టిమ్ హోవాట్, బ్లూమ్‌బర్గ్ ప్రతినిధి జీనెత్ రోడ్రిగ్స్, బిజినెస్ టుడే ప్రతినిధి అలోక్ నాయర్, ఎన్‌డీటీవీ నుంచి ఆయుష్ ఐలావాదిలతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన సీఎం.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విషయంలో జరుగుతున్న పరిణామాలను, ప్రభుత్వ పాలసీలను వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు తన సంభాషణలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ద్వారా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు వివిధ రంగాల్లో నూతన పరిణామాలను గమనించడానికి ఈ సదస్సు అద్భుతమైన వేదికగా ఉందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌ను బ్రాండింగ్ చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరంను తాను ఉపయోగించుకున్నానని చెప్పారు. రాష్ట్రానికి బ్రాండింగ్ వస్తే పెట్టుబడులు వస్తాయని, దానివల్ల అభివృద్ధి జరుగుతుందని.. తద్వారా పేదలకు సంక్షేమం అందించవచ్చని సీఎం వివరించారు. నాడు సింగపూర్ మాజీ అధ్యక్షుడు లీ క్వాన్ యూ, మలేషియా మాజీ అధ్యక్షుడు మహతీర్ తనకు స్ఫూర్తిగా నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. తాను ఆశావాదినని, భారీ లక్ష్యాలు నిర్దేశించుకోవడం, వాటి కోసం నిరంతరం పనిచేయడం తనకు అలవాటని అన్నారు. ముందుచూపుతో వ్యవహరించి, వినూత్నంగా ఆలోచించి, చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతానని సీఎం చెప్పారు. యువతకు ఇదే విషయాన్ని చెబుతూ, ఆ దిశగా ప్రోత్సహిస్తున్నానని తెలిపారు.తమది పరిశ్రమల ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని పేర్కొన్న ముఖ్యమంత్రి.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని, వాటి నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైమ్‌లో మానిటర్ చేస్తున్నామని వివరించారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు ఉత్పత్తి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖపట్నానికి గూగుల్ కంపెనీ రావడం ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగుగా చంద్రబాబు అభివర్ణించారు. ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలోఅప్ వల్లే ఆ పెట్టుబడి సాధించామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ పెట్టుబడిపై లోకేశ్ సంప్రదింపులు జరిపారని ముఖ్యమంత్రి తెలిపారు.వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని, రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేసి పరిశ్రమ నిర్మిస్తున్నామని చెప్పారు. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని తెలిపారు. టెక్నాలజీ, టెలికాం, విద్యుత్, ఏవియేషన్, నేషనల్ హైవేస్ రంగాల్లో వచ్చిన సంస్కరణలతో దేశ దశ దిశ మారిపోయిందని చంద్రబాబు అన్నారు. 30ఏళ్ల క్రితం దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయని.. నేడు ప్రతి రంగంలో దేశం అద్భుత పురోగతి సాధిస్తోందని చెప్పారు. అప్పుడు.. ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నామని, ఆ సంస్కరణలే తమ రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయని సీఎం వివరించారు.రాజధాని నిర్మాణం ఒక అవకాశమని.. అద్భుతమైన ప్రణాళికతో రాజధాని నిర్మాణం జరుగుతోందని చెప్పారు చంద్రబాబు. అమరావతి భవిష్యత్ నగరంగా ఉంటుందని, టెక్నాలజీ, గ్రీన్-బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నామని తెలిపారు. టూరిజం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, మా రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని అన్నారు. ఏపీలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది తన ఆలోచనగా చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, చేస్తున్న ఆలోచనలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోందని తెలిపారు సీఎం.చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారతదేశానికి లేదని, సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ ఇండియా అదనపు బలమని అన్నారు. ఒకప్పుడు భారత్ ఎలక్ట్రానిక్స్ వస్తువులను దిగుమతి చేసుకునేదని.. అలాంటి పరిస్థితి నుంచి ఆ రంగంలో ఎగుమతులు చేసే స్థాయికి చేరుకుందని చెప్పారు. గతంలో డబుల్ డిజిట్ గ్రోత్ అంటే నమ్మలేదని, ఇప్పుడు అదే నిజమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# తెలంగాణకు 1,000 కోట్ల పెట్టుబడులు..



## దావోస్‌లో సర్కార్ కీలక ఒప్పందం

దావోస్, జనవరి 21: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026 సదస్సు సందర్భంగా అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం(ఓనీజ) కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో ఆ సంస్థ సీఈఓ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్(ఓఖీూ) యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో రూ.1,000 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఎమ్ఆర్ఓ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీంతో రాష్ట్రం.. విమానయాన, ఏరోస్పేస్ రంగాల్లో మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది.అలాగే.. కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న బ్లైజ్( కంపెనీతో మరో ఎంవోయూ కుదిరింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో బ్లైజ్ సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎనర్జీ రంగాల్లో ంఎ పైలట్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి. తక్కువ విద్యుత్ వినియోగంతో ంఎ హార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో బ్లైజ్ సంస్థ అగ్రగామి. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్(ఖీడఆ) సెంటర్ విస్తరణకు బ్లైజ్ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ంఎ రంగాలకు ఊపిరి లభించనుంది. తెలంగాణను ంఎ డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ంఎ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభంకానుందని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు.కాగా.. సీఎం రేవంత్.. జనవరి 20 నుంచి 23 వరకు దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సులో పాల్గొననున్నారు. జనవరి 19న మేడారంలో సమ్మక్క-సారలమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేసిన అనంతరం, హైదరాబాద్ నుంచి స్విట్జర్లాండ్‌కు బయలుదేరారు సీఎం. జ్యూరిచ్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు తెలంగాణ డయాస్పోరా సభ్యులు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రపంచ నాయకులు, సీఈఓల ముందు ప్రదర్శించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ దావోస్ పర్యటన కొనసాగుతోంది.


## ఏపీ రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు రంగం సిద్ధం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధంగా ప్రకటించేందుకు రంగం సిద్ధమైంది. అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా వినతిపత్రం సమర్పించింది. 2024 జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో.. ఏపీకి రాజధానిని తప్పక ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో, రాజధానిగా అమరావతి ఎంపిక ప్రక్రియ, నిర్మాణ కార్యక్రమాలపై వివరాలను కూడా కేంద్రానికి నోట్ ద్వారా అందించారు.ఈ విషయమై.. కేంద్రం ఇప్పటికే అన్ని మంత్రిత్వ శాఖల నుంచి అభిప్రాయాలు సేకరించేసి, నీతి ఆయోగ్ అభిప్రాయాన్ని కూడా కోరినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా ప్రకటించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది

## ఆరావళిలో అక్రమ మైనింగ్‌పై నిపుణుల కమిటీ..


### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: ఆరావళి పర్వత శ్రేణుల్లో అక్రమ మైనింగ్‌పై సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో స్పందించింది. దీనివల్ల కోలుకోలేనంత నష్టం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది. పర్యావరణానికి జరిగే నష్టాన్ని నివారించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం నిర్ణయించింది. ఆరావళి నిర్వచనంపై గతంలో ఇచ్చిన తీర్పు, దానిపై వస్తున్న



అభ్యంతరాలను పరిష్కరించేందుకు సుమోటోగా కోర్టు ఈ కేసును స్వీకరించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పాంచోలితో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తూ, మైనింగ్‌లో నిపుణులైన పర్యావరణవేత్తలు, సైంటిస్టుల పేర్లను నాలుగు వారాల్లోగా తమకు తెలియజేయాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, అమికస్ క్యూరీ కె.పరమేశ్వర్‌లను ఆదేశించింది. ఈ కమిటీ మైనింగ్, సంబంధిత సమస్యలపై పరిశీలన చేసి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తుందని తెలిపింది.

## వసంతరాయలు కుటుంబాన్ని పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



కృష్ణా: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జనసేన కార్యకర్త వసంతరాయలు కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. పవన్‌తో పాటు ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, రామకృష్ణ, విక్కుర్తి శ్రీనివాస్.. వసంతరాయలు ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..'జులైలో వసంతరాయలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. కుటుంబసభ్యులు వసంతరాయలు అవయవాలను దానం చేసి ఐదుగురికి కొత్త జీవితం ఇచ్చారు. అంత బాధలోనూ కుటుంబ సభ్యులు మంచి నిర్ణయం తీసుకున్నందుకు నా ధన్యవాదాలు. నేను స్వయంగా వారితో మాట్లాడి ధైర్యం చెప్పేందుకు వచ్చాను. వారి కుటుంబానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అండగా నిలబడ్డారు.



# సంపాదకీయం

గురువారం 22-01-2026

## బీజేపీలో యువతరం....

భారతీయ జనతా పార్టీలో తరాల మార్పు మొదలైంది. కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, బీజేపీ జాతీయ సారథ్య బాధ్యతలను యువ నాయకుడు నితిన్ నబిన్‌కు అప్పగించడం భారత రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం 45 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీకి అధ్యక్షుడవ్వడం అంటే అది సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, రాబోయే రెండు దశాబ్దాల రాజకీయాలను శాసించేలా మోదీ–షా ద్వయం రచించిన ఒక పకడ్బందీ వ్యూహం అని చెప్పొచ్చు.నితిన్ నబిన్ ఎదుగుదల వెనుక వారసత్వ రాజకీయాల నీడ లేదు.. కేవలం కఠోర శ్రమ, అంకితభావం మాత్రమే ఉన్నాయి. ఆయన రాజకీయ ప్రస్థానం బీహార్ గల్లీల నుండి మొదలైంది. భారతీయ జనతా యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీహార్ యువమోర్చా అధ్యక్షుడిగా ఆయన పార్టీ క్యాడర్‌ను కింది స్థాయి నుండి నిర్మించారు. 2006లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్, అప్పటి నుండి వెనుదిరిగి చూడలేదు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. బీహార్ ప్రభుత్వంలో రోడ్లు, న్యాయశాఖ, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. కేవలం పార్టీని నడపడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఎలా నడపాలో కూడా తెలిసిన నాయకుడు కావడంతో అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపింది.బీజేపీలో ఎంతోమంది సీనియర్లు, హేమాహేమీలు ఉన్నప్పటికీ నితిన్ నబిన్ వైపే మొగ్గు చూపడానికి ప్రధాన కారణం ఆయనకున్న 'సమన్వయ కర్త' అనే ఇమేజ్. మోదీ–షాల వ్యూహాలను తు.చ. తప్పకుండా అమలు చేయడంలో ఆయన దిట్ట. పార్టీ గీసిన గీతను దాటకుండా, అందరినీ కలుపుకుపోవడం ఆయన ప్రత్యేకత. ఆయన కాయస్థ సామాజిక వర్గానికి చెందినవారు. ఇది రాజకీయంగా తటస్థ వర్గంగా పరిగణించబడుతుంది. ఏ ఇతర బలమైన కుల వర్గాలతోనూ ఘర్షణ లేని నేపథ్యం కావడం వల్ల, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కుల సమీకరణాలను సమన్వయం చేయడం ఆయనకు సులభమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 80 ఏళ్లు పైబడిన సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సారథ్యంలో నడుస్తుంటే, బీజేపీ 45 ఏళ్ల యువకుడిని తెరపైకి తెచ్చి దేశ యువతకు ఒక బలమైన సంకేతాన్ని పంపింది.నితిన్ నబిన్ సామర్థ్యంపై అధిష్టానానికి పూర్తి నమ్మకం కలిగించింది 2023 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే. అప్పట్లో అక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తిరుగులేని శక్తిగా ఉండేవారు. సర్వేలన్నీ బీజేపీ ఓడిపోతుందని చెప్పాయి. ఆ క్లిష్ట సమయంలో పార్టీ ఇన్‌చార్జ్‌గా వెళ్లిన నబిన్, తన మైక్రో మేనేజ్‌మెంట్ వ్యూహంతో అద్భుతం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో బూత్ కమిటీలను బలోపేతం చేసి, కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ఇటీవల ఢిల్లీలో బీజేపీ తిరిగి తన ఉనికిని చాటుకోవడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. కష్టమైన టాస్క్‌లను సైతం సైలెంట్‌గా పూర్తి చేసే 'ట్రబుల్ షూటర్'గా ఆయన పేరు తెచ్చుకున్నారు.నితిన్ నబిన్ ముందు ఇప్పుడు పూలపాన్పు లేదు, ముళ్ల బాట ఉంది. బీజేపీకి ఇప్పటికీ సవాల్‌గా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం ఆయన ప్రాథమిక లక్ష్యం. త్వరలో జరగబోయే బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం ఆయన సారథ్యానికి పరీక్షగా నిలవనుంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో కొత్తగా చేరే కోట్లాది మంది యువ ఓటర్లను బీజేపీ వైపు తిప్పుకోవడం కోసం ఆయన తనదైన శైలిలో పార్టీని డిజిటల్, క్షేత్రస్థాయిలో ఆధునీకరించాల్సి ఉంది. తిన్ నబిన్ 1980 మే 23న జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన తండ్రి నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా, తల్లి మీరా సిన్హా, కిశోర్ సిన్హా సీనియర్ బీజేపీ నాయకుడు. ఆయన పాట్నా వెస్ట్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు బీహార్ శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కాగా, నితిన్ నబిన్ 1996లో పాట్నాలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలో పాసయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలోని సీఎస్‌కేఎం పబ్లిక్ స్కూల్ నుంచి 1998లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు.నితిన్ నబిన్.. దీప్‌మాలా శ్రీవాస్తవను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా.. నితిన్ నబిన్ రాజకీయ ప్రస్థానం 2006 ప్రారంభమైంది. పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో గెలిచి.. రాజకీయాల్లోకి ప్రవేశించారు నితిన్. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. ఆయన బాంకిపూర్‌కు మారారు. అప్పటి నుంచి 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ.. తన కంచుకోటను కాపాడుకున్నారు.నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో కూడా నితిన్ నబిన్ కీలక పదవుల్లో పనిచేశారు. 2021 ఫిబ్రవరి నుంచి 2022 ఆగస్టు వరకు రహదారుల నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. 2025 ఫిబ్రవరి నుంచి 2025 డిసెంబర్ వరకు తిరిగి అదే శాఖ బాధ్యతలను చేపట్టారు. ఇక 2024 మార్చి 2025 ఫిబ్రవరి మధ్య.. ఆయన పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖతో పాటు న్యాయ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు. ఆయన మంత్రిగా ఉన్న కాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై దృష్టి సారించారు.బీజేపీ యువ విభాగం నుంచి వచ్చిన నబిన్.. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. గతంలో నితిన్ బీజేపీ యువ మోర్చా (బీజేవైఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీజేవైఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఇదే సమయంలో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ ఐక్యతా యాత్ర, 1965 యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులర్పిస్తూ గౌహతి నుంచి తవాంగ్ వరకు నిర్వహించిన పాదయాత్ర సహా అనేక పార్టీ ప్రచార కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు.మరోవైపు, బీజేపీ సిక్కిం ఇంచార్జిగా, ఛత్తీస్‌గఢ్ కో- ఇంచార్జిగా నితిన్ నబిన్ పనిచేశారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించారు. 2025 డిసెంబర్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు.. ఆయన్ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది.

# కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి కదులుతున్న పల్లెలు



**బెల్ట్ షాపు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకోవడానికి ర్యాలీలు**

**చాటుమాటుగా కిరాణా షాపుల్లో మద్యం అమ్ముతున్న వాళ్లకి యూత్ కౌన్సిలింగ్**

**మద్యం నియంత్రణ దిశగా మునుగోడు లో మారుతున్న ముఖచిత్రం**

మునుగోడు ,నియోజకవర్గంలో మద్యం నియంత్రణపై మద్యం షాపుల సమయపాలన పై వెనక్కి తగ్గేదే లేదని తమ వద్దకు వచ్చిన మద్యం వ్యాపారులకు తేల్చి చెప్పిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి మునుగోడు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్పందన వస్తుంది... ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారం ఎందుకని పొద్దంతా మీరు తాగిన తర్వాతే ప్రజలకు తాపించడని మద్యం వ్యాపారులను ఉద్దేశించి అన్న మాటలకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చదువుకున్న మేధావులు, సామాజిక అనుభవజ్ఞులు శబాష్ అంటున్నారు.. రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో మాట్లాడే మాటలు అక్షర సత్యాలని మద్యం మహమ్మారి వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయాని, గ్రామాలలో యుక్త వయసులోనే మహిళలు విదవలు గా మారుతున్నారని సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు... 2018లో తాను మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యుడి గా గెలిచిన తర్వాత గ్రామాలలో బెల్ట్ షాపులను నిర్మూలిస్తానని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు..గెలవగానే బెల్ట్ షాపులను నిర్మూలించాలని పిలుపునిచ్చారు..ఆ పిలుపు అందుకున్న కొన్ని గ్రామ పంచాయతీలు గ్రామ సభ తీర్మానం చేసి బెల్ట్ షాపులను నిర్మూలించాయి.. బెల్టు షాపులను నిర్మూలించిన గ్రామాలకు తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున ఐదు లక్షల ఆర్థిక సహాయం కూడా చేశారు.. కానీ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండడం వల్ల గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్మూలన అనేది సక్సెస్ కాలేదు... తిరిగి 2023లో గెలిచిన తర్వాత మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలన లేకుండా చేశారు.. అక్కడితో ఆగకుండా నూతన మద్యం పాలసీ రాగానే మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులు దక్కించుకునే వాళ్లకు పలు సూచనలు చేశారు ఆ సూచనల ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు మాత్రమే వైన్ షాపులు తెరవాలని, సాయంత్రం 6 గంటల తరవాతే పర్మిట్ రూములను ప్రారంభించాలని ఆదేశించారు... గౌరవ ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు మునుగోడులో మద్యం నియంత్రణ మద్యం షాపుల సమయపాలన కొనసాగుతోంది..అయితే ఇటీవల కొందరు మద్యం షాపుల యజమానులు సమయపాలనలో కొద్దిగా మార్పులు తీసుకురావాలని కోరడానికి రావడంతో మద్యం షాపుల సమయపాలనలో ఎటువంటి మార్పు ఉండదని మద్యం వ్యాపారులకు తెగేసి చెప్పారు.. తాము ఎన్నుకున్న తమ నాయకుడు ప్రజల ఆరోగ్యం పట్ల కమిట్మెంట్తో పని చేస్తున్న విధానాన్ని చూసి ఆయన సంకల్పానికి అనుగుణంగా మునుగోడు నియోజకవర్గం లోని గ్రామాలలో చాటుమాటుగా బెల్ట్ షాపులను నిర్వహించొద్దని ర్యాలీలు నిర్వహిస్తున్నారు.. గట్టుప్పల్ మండలం వెల్మకన్నే గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించద్దని ర్యాలీ తీస్తూ ప్రతి ఒక్క కిరాణా షాప్ యజమాని దగ్గరికి వెళ్లి రాజగోపాల్ రెడ్డి గారి సంకల్పానికి మద్దతుగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో చాటుమాటుగా మద్యం అమ్మకాలు జరిపితే ఊరుకోమని కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ప్రకృతికి అనుగుణంగా మనిషి జీవన విధానం కొనసాగుతోంది సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మనిషి కష్టపడి పని చేయాలని ప్రకృతి నేర్పింది.. ఎన్నో వేల తరాలు ఆ ప్రకృతి నియమాలకు కట్టుబడే జీవనాన్ని కొనసాగిస్తూ తరువాతి తరానికి ఆ జీవన విధానాన్ని అందించారు... కానీ ప్రకృతి విధానానికి విరుద్ధంగా సూర్యోదయం నుంచి తాగడం మొదలుపెడుతున్నారు పనిచేసుకొని పైసలు సంపాదిస్తూ భార్య పిల్లల్ని సాకాల్సిన సమయాన్ని తాగుడుకు కేటాయిస్తూ బానిసలుగా మారి కుటుంబాలను ఆర్థికంగా ఆరోగ్యంగా దెబ్బ తీసుకుంటున్నారు.. సూర్యోదయం నుండి తాగే విధానానికి స్వస్తి పలికి ప్రజలు పొద్దంతా పనిచేసుకున్న తర్వాతే తాగుడు గురించి ఆలోచించాలనే సంకల్పంతోనే మునుగోడు నియోజకవర్గంలో మద్యం నియంత్రణ మద్యం షాపుల సమయాలలో మార్పు విధానాన్ని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు తీసుకొచ్చారు.. తాను తాగుడుకు వ్యతిరేకం కాదని పొద్దస్తమానం పనిచేయకుండా అతిగా తాగే విధానానికి మాత్రమే వ్యతిరేకమని ఎన్నో వేదికల మీద స్పష్టం చేశారు..ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారం మంచిదికాదని వైన్ షాపుల యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు..అక్కడితో ఆగకుండా మొదట మనం పాటిస్తేనే ప్రజలు పాటిస్తారని తనతో పాటు తిరిగే తన అనుచరులకు అభిమానులను కూడా పగటిపూట మద్యం సేవించొద్దని హుకుం జారీ చేయడంతో నాయకులు అభిమానులు కూడా పగటి పూట మద్యం తీసుకొనే విధానానికి స్వస్తి పలికారు.


## బంగ్లాదేశ్ లో హింస.. భారత రాయబార కుటుంబాలపై కీలక నిర్ణయం



ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఆందోళనకర పరిస్థితులు ఉన్న సంగతి తెలిసిందే. అందులోనూ ఇండియాపై అక్కడివాళ్లు ద్వేషంతో రగిలిపోతున్నారు. మరోవైపు హిందువులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. హిందువుల్ని చంపడం, దాడి చేయడం, వారి ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి ఘటనలు బంగ్లాదేశ్ లో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్తితుల్లో ఇప్పటికే ఇరు దేశాల సంబంధాలు క్షీణించినట్లు కనిపిస్తోంది.అక్కడ ఉన్న హిందువులతోపాటు భారతీయ అధికారులకు కూడా రక్షణ లేదనే నిర్ణయానికి ఇండియా వచ్చేసింది. అందుకే వారి భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ లో ఉన్న రాయబార కార్యాలయ సిబ్బంది కుటుంబాల్ని తిరిగి ఇండియాకు వచ్చేయాలని ఆదేశించింది. బంగ్లాలోని భారత రాయబారి, ఇతర సిబ్బంది, వేరే విభాగాల్లో పని చేస్తున్న భారత సిబ్బంది కుటుంబ సభ్యుల్ని ఇండియాకు రావాలని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశించినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. బంగ్లాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.అయితే, ఈ నిర్ణయం సిబ్బంది కుటుంబ సభ్యులకు మాత్రమే అని.. సిబ్బంది మాత్రం అక్కడ పని చేస్తారని ఆయన తెలిపారు. భారతీయ రాయబార కార్యాలయం ఎప్పట్లాగే పని చేస్తుందని, ఇతర సేవలు కూడా కొనసాగుతాయని తెలిపారు. అయితే, ఎంతకాలంలోపు కుటుంబ సభ్యులు ఇండియా తిరిగి రావాలి అనే కాలపరిమితి విషయంలో ఇంకా క్లారిటీ లేదు. ప్రస్తుతం బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ప్రధాన రాయబార కార్యాలయం ఉండగా, ఛట్టోగ్రామ్, ఖుల్నా, రజ్షాహి, సిల్హెట్ లలో రాయబార కార్యాలయాలున్నాయి.

## సికింద్రాబాద్ -మణుగూరు రైలుకు కారేపల్లిలో హాల్టింగ్ పునరుద్ధరణ

కారేపల్లి, జనవరి 21 : సికింద్రాబాద్–మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12745) రైలుకు బుధవారం నుండి కారేపల్లి రైల్వే స్టేషన్‌లో నిలుపుదలను పునరుద్ధరిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మణుగూరు నుండి సికింద్రాబాద్‌కు వెళ్లేటప్పుడు ఈ రైలుకు కారేపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉండగా తిరుగు ప్రయాణంలో హాల్టింగ్ లేదు. ఈ సమస్యతో పాటు కరోనా సమయంలో రద్దు అయిన మిగతా రైళ్లను పునరుద్ధరించాలని, భద్రాచలం రోడ్డు ? తిరుపతి మధ్య కొత్త రైలును నడపాలని ఇటీవల కారేపల్లి పర్యటనకు వచ్చిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిని స్థానిక సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి కోరారు. దాంతో స్పందించిన ఎంపీ ఈ విషయాలను రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందులో భాగంగా సికింద్రాబాద్ మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలుకు కారేపల్లి స్టేషన్‌లో హాల్టింగ్ కల్పిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎంపీ రఘురాం రెడ్డికి సామాజిక కార్యకర్త సురేందర్ రెడ్డి, స్థానిక ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆర్మూర్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయం : మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్ : ఆర్మూర్ గడ్డ.. కేసీఆర్ అడ్డా అని ఆర్మూర్ మాజీ శాసనసభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో ఈరోజు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ?ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ సంక్షేమ పాలన, ఆయన ప్రవేశపెట్టిన ప్రజాపథకాలే బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన బలమని అన్నారు. రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, దళిత బంధు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, 24 గంటల ఉచిత విద్యుత్, కేసీఆర్ కిట్టు, అలాగే వృద్ధులకు 2000 రూపాయలు, దివ్యాంగులకు 4000 రూపాయల పెన్షన్ వంటి చారిత్రాత్మక పథకాలు ప్రజల జీవితాల్లో పెను మార్పులు తీసుకువచ్చాయని గుర్తు చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలు నేటికీ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశాయన్నారు. అదే నమ్మకంతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కే ఓటు వేయనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు అందరూ ఐక్యతతో పనిచేసి, కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ఆర్మూర్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో రాజ్యసభ ఎంపీ కే.ఆర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, షకీల్ అమీర్, మాజీ ఎమ్మెల్సీ వి.జి గౌడ్, ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, సీనియర్ నాయకులు పోల సుధాకర్, సంతోష్, సుజీత్ సింగ్ ఠాగూర్, సత్య ప్రకాష్, చిన్నారెడ్డి, గంగాధర్, మోయిన్, ఇమ్రాన్, మాలిక్ బాబా, అంజద్, రహమాన్, షాకీర్ తదితర ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణిలో కాంగ్రెస్ దందాలపై సీబీఐ విచారణ జరిపించాలి : టీబీజీకేఎస్ నాయకులు

ఇల్లెందు, జనవరి 21 : తెలంగాణ సిరుల తల్లి సింగరేణి రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన అక్రమాలు, దందాలపై సిబిఐచే విచారణ జరిపించాలని టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన, ధర్నా చేపట్టారు. ఇల్లెందు పట్టణం జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం ముందు టీబీజీకేఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ జాఫర్ హుస్సేన్ అధ్యక్షతన బొగ్గు గనులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, డిసిసిబి మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్ పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సింగరేణికి అన్యాయం జరుగుతుందని గ్రహించి ఉద్యమం చేసి సాధించిన తెలంగాణలో సింగరేణి కార్మికులకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సింగరేణి అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి సింగరేణికి మంచి గుర్తింపు తెచ్చిన గొప్ప నేత కేసిఆర్ అన్నారు.కేసీఆర్ ఆధ్వర్యంలో కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు నిర్వహించి కార్మికులను ఆదుకున్నట్లు తెలిపారు. అలాగే కార్మికులు కరెంట్ బిల్లు కట్టకుండా కార్మికులకు, కార్మికుల కుటుంబాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి సింగరేణి అభివృద్ధి పథంలో నడిపించారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో సింగరేణికి, సింగరేణి ఉద్యోగులకు స్వర్ణ యుగంగా నడిచింది. కానీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు సింగరేణి అభివృద్ధి చేస్తాం, కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తామని, కొత్త గనులు తీసుకొస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే అప్పులు తెచ్చి జీతాలు ఇచ్చే దుస్థితికి తెచ్చారు అని దుయ్యబట్టారు. సింగరేణిలో ఎప్పుడు వినని చూడని రీతిలో సైడ్ విజిట్ అనే నిబంధనలు తెచ్చి బొగ్గు గనుల దోపిడీకి కొత్తరకంగా తెర లేపారని, ప్రస్తుతం దేశీయ బొగ్గు గనుల పరిశ్రమంలోనే నైనీ బ్లాక్ వ్యవహారం అతిపెద్ద కుంభకోణం దీనిపై సిబిఐ ద్వారా న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లెందు మాజీ కౌన్సిలర్లు కటకం పద్మావతి, చీమల సుజాత, తార, బీఆర్ఎస్ నాయకులు భూక్య దల్సింగ్, ఇల్లెందు పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బర్, ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, ఇల్లెందు మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మం పార్టీ రేణుక, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ అజ్మీర బావుసింగ్, లకావత్ దేవీలాల్, బర్మావత్ లాల్ సింగ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, సుదిమల్ల సర్పంచ్ కుంజ సుకనయ్య, చల్ల సముద్రం సర్పంచ్ యాపె శంకర్, మాజీ సర్పంచ్ తాటి మౌనిక, స్థానిక నాయకులు రవితేజ, కిరణ్, సునీల్ ,శ్రీకాంత్, లలిత కుమార్ పాసి, ఉపేందర్, వర రమేష్, గిన్నారపు రాజేష్, చాంద్ పాషా, కాసాని హరిప్రసాద్, రవికాంత్, రామ్ లాల్ పాసి, మదర్ బి, మౌనిక, సువర్ణపాక సత్యనారాయణ, భూక్య సురేష్, రమేష్, మునిగంటి శివ, వీరభద్రం పాల్గొన్నారు.



# ఏపీలో కొత్త పార్టీలు

విజయవాడ, జనవరి 21, ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం.. కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది.ఏబీ వెంకటేశ్వరరావుజగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన అధికారి లూప్ హోల్స్ లో ఉండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు. ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటీవల రాజకీయంగా యాక్టివిటీస్ తగ్గించారు షర్మిల. అందుకే ఈ ప్రచారం మరింతగా సాగుతోంది. అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# టీడీపీలో సెకండ్ జనరేషన్

విజయవాడ, జనవరి 21,తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఈ మార్చితో పార్టీకి 44 సంవత్సరాలు పూర్తై 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. పార్టీ ఆవిర్భావ సమయంలో యువకులుగా రాజకీయాల్లోకి వచ్చిన చాలా మంది నేతలు ఇప్పుడు వయోభారంతో సీనియర్ స్థాయికి చేరుకున్నారు. అప్పట్లో అన్న ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలి టికెట్ తీసుకుని అసెంబ్లీలో అడుగుపెట్టిన యువ నాయకులే, నేడు పార్టీలో అత్యంత అనుభవజ్ఞులుగా గుర్తింపు పొందుతున్నారు. కాలం మారినట్లే, రాజకీయాల్లోనూ మార్పు అవసరమన్న ఆలోచనలు ఇప్పుడు ఆ సీనియర్లలో మొదలయ్యాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ అంతటా చూస్తే, టీడీపీలోని సీనియర్ నేతల నుంచి ఒకే రకమైన మాట వినిపిస్తోంది. తాము ఇక రాజకీయాల నుంచి తప్పుకోవాలని, యువతకు అవకాశం ఇవ్వాలని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. ఇది ఒకరిద్దరి అభిప్రాయం మాత్రమే కాకుండా, చాలా జిల్లాల్లో వినిపిస్తున్న స్వరం కావడం విశేషం. ఈ జాబితా ఎంత పెద్దదంటే, ఒక ప్రాంతీయ పార్టీలో ఇంతమంది నేతలు ఒకేసారి పక్కకు తప్పుకునే పరిస్థితి దేశ రాజకీయాల్లో అరుదేనని చర్చ సాగుతోంది.సాధారణంగా రాజకీయాల్లో వయస్సుతో సంబంధం లేదని, చివరి శ్వాస వరకూ కొనసాగుతామని చెప్పే నాయకులు ఎక్కువ. కానీ టీడీపీ సీనియర్లు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణంగా రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా నారా లోకేష్ నాయకత్వం మరింత బలపడుతూ, ఆయన చుట్టూ కొత్త తరం నాయకుల బృందం తయారవుతుందని భావిస్తున్నారు. ఈ మార్పును దృష్టిలో పెట్టుకుని, ముందుగానే తాము తప్పుకుంటే మంచిదన్న ఆలోచన సీనియర్లలో ఏర్పడినట్టు చెబుతున్నారు.ఇదే సమయంలో మరో వ్యూహాత్మక ఆలోచన కూడా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు వద్ద తాము కీలక పాత్ర పోషించినట్లే, ఇప్పుడు తమ వారసులను లోకేష్ టీంలోకి చేర్చితే భవిష్యత్తులో కుటుంబ రాజకీయాలకు భరోసా ఉంటుందన్న భావన కూడా ఈ నిర్ణయాల వెనుక ఉందని అంటున్నారు. "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి" అన్న సామెత రాజకీయాల్లో ఉన్నవారికి మరింత వర్తిస్తుందన్న మాట వినిపిస్తోంది.ఇటీవల నర్సీపట్నం లో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనకు 70 ఏళ్లు వచ్చాయని, ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని వేదికపైనే ప్రకటించడం పెద్ద చర్చకు దారితీసింది. ఆయన కుమారుడు విజయ్ పాత్రుడుకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్న ప్రయత్నం జరుగుతోందన్న ప్రచారం కూడా ఉంది. అదే విధంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా వయోపరంగా అదే దశకు చేరుకుంటుండటంతో, ఆయన కుటుంబ వారసత్వంపై దృష్టి పెట్టారని అంటున్నారు.ఈ జాబితాలో బండారు సత్యనారాయణమూర్తి , కిమిడి కళా వెంకటరావు , దాడి వీరభద్రరావు వంటి పలువురు ప్రముఖులు ఉన్నారు. ఒక అంచనాగా చూస్తే 2029 ఎన్నికల నాటికి కనీసం ముప్పయి నుంచి నలభై మంది సీనియర్ నేతలు రాజకీయాల నుంచి తప్పుకునే అవకాశం ఉందన్న మాట వినిపిస్తోంది. అదే సంఖ్యలో కొత్త తరం నాయకులు రంగప్రవేశం చేసే అవకాశమూ ఉందని అంటున్నారు. ఈ మార్పులను టీడీపీ హైకమాండ్ ఎలా సమతుల్యం చేస్తుంది, అనుభవం?యువత మధ్య సమన్వయాన్ని ఎలా సాధిస్తుంది అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

# కార్యకర్తలు సరే... లీడర్లు ఏరీ



కడప, జనవరి 21, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు.ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది.అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపోతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు.ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూ వైసీపీ భవిష్యత్ అడుగులు ఎలా ఉండబోతాయన్నదే రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# విశాఖలో ఇమ్మిగ్రేషన్ ఆఫీస్

విశాఖపట్టణం, జనవరి 21, విశాఖపట్నం నగరం రోజురోజుకీ విస్తరిస్తూ ఒక మెగా సిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన ఈ నగరానికి తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక బహుమతి అందించింది. కేంద్ర హోం శాఖఆధ్వర్యంలో పనిచేసే ఇమ్మిగ్రేషన్ బ్యూరో కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ కార్యాలయం ప్రారంభం కావడంతో విశాఖతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు విదేశీ ప్రయాణాల విషయంలో పెద్ద ఊరట లభించనుంది.ఇప్పటికే మరో ముఖ్యమైన అభివృద్ధి కూడా సమీప భవిష్యత్తులో పూర్తి కాబోతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే కొన్ని నెలల్లో అందుబాటులోకి రానుంది. అక్కడి నుంచి తొలి అంతర్జాతీయ విమానం విదేశాలకు ఎగరబోతున్నట్టు సమాచారం. రానున్న రోజుల్లో అమెరికా, ఆస్ట్రేలియా సహా పలు దేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఇమ్మిగ్రేషన్ సేవలు తప్పనిసరి కావడంతో విశాఖలోనే ఈ కార్యాలయం ఏర్పాటు చేయడం సమయోచిత నిర్ణయంగా భావిస్తున్నారు.ఇంతవరకూ విశాఖ లేదా ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి విదేశాలకు వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా హైదరాబాద్ లేదా చెన్నై నగరాలకు వెళ్లి అక్కడ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి వచ్చేది. దీనివల్ల సమయం, ఖర్చు రెండూ ఎక్కువయ్యేవి. ఇప్పుడు ఈ సదుపాయం నేరుగా విశాఖ లో లభించనుండటంతో ప్రజలకు పెద్దగా ఉపశమనం కలగనుంది. విదేశీ ఉపాధి, ఉన్నత విద్య, వ్యాపార అవసరాల కోసం వెళ్లే వారి సంఖ్య ఈ ప్రాంతంలో వేగంగా పెరుగుతోంది. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.విశాఖకు అంతర్జాతీయ హోదా మరింత బలపడేందుకు ఈ ఇమ్మిగ్రేషన్ బ్యూరో కార్యాలయం కీలకంగా మారనుంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖలో ఈ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరగా, వెంటనే సానుకూల స్పందన లభించడం విశేషం. ఇప్పటివరకు దేశీయ విమానాలకే పరిమితమైన విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలు, ఇకపై అంతర్జాతీయ స్థాయికి చేరుకోనున్నాయి. అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తేవడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.రాబోయే రోజుల్లో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో విమాన సేవలు కూడా విస్తరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయి. ఐటీ రంగం, పర్యాటక రంగం అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. భోగాపురం విమానాశ్రయం కేవలం ఉత్తరాంధ్రకే కాకుండా ఒడిశా , ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగున ఉన్న రాష్ట్రాల ప్రజలకు కూడా ఉపయోగపడనుంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు మరిన్ని విశాఖలో ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, నగర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు

## 42 ఎకరాల భూమి



విజయవాడ, జనవరి 21,హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కొండాపూర్ ప్రాంతంలో గల 42 ఎకరాల భూమి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. సుమారు 4,000 కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై తమకే అధికారం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. కర్నూలు కేంద్రంగా పనిచేసే బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ కు చెందిన ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేయడం సంచలనంగా మారింది.ఈ వివాదానికి మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఉన్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ రిజిస్టర్ అయింది. ఈ ట్రస్ట్‌కు కొండాపూర్‌లోని సర్వే నంబర్లు 105 నుంచి 108 వరకు సుమారు 42.03 ఎకరాల భూమి ఉంది. 2005లో అప్పటి ప్రభుత్వం జీఓ 2065 ద్వారా ఈ యూఎల్‌సీ మిగులు భూములను ట్రస్ట్‌కు క్రమబద్ధీకరించింది. బాలసాయిబాబా మరణం తర్వాత ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను ఏపీ దేవాదాయ శాఖ చేపట్టింది. కర్నూలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని ఈ ట్రస్ట్‌కు అధికారిగా నియమించారు.ఈ వివాదంలో ప్రైవేటు సంస్థ అయిన భూపతి ఎస్టేట్స్ ప్రవేశించడంతో సమస్య సంక్లిష్టంగా మారింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ, ట్రస్ట్ పేరుకు బదులుగా 'భూపతి ఎస్టేట్స్' పేరును చేర్చింది. బాలసాయిబాబా ట్రస్ట్ భూములను ఈ ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమకు సమాచారం ఇవ్వకుండా, ఏపీ పరిధిలో ఉన్న ట్రస్ట్ భూములను తెలంగాణ ప్రభుత్వం ఎలా బదలాయిస్తుందని ఏపీ దేవాదాయ శాఖ ప్రశ్నిస్తోంది. ఈ క్రమబద్ధీకరణ చెల్లదని, తెలంగాణ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది.తమ్మనబోయిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్ పై విచారణ సందర్భంగా ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ కీలకమైన కౌంటర్ దాఖలు చేశారు. ఈ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ చట్టం కింద ఏపీలో రిజిస్టర్ అయింది. కాబట్టి దాని ఆస్తుల నిర్వహణ ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని భూములు ఆ రాష్ట్రాలకే చెందుతాయన్న నియమం ఉన్నప్పటికీ, ఒక రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ట్రస్ట్ ఆస్తులను మరో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతుందని ఏపీ ప్రశ్నిస్తోంది. ఈ భూములపై తెలంగాణకు ఎలాంటి పరిపాలనాపరమైన అధికారం లేదని ఏపీ తేల్చి చెప్పింది.తెలంగాణ ప్రభుత్వం ఈ భూములు తమ భౌగోళిక పరిధిలో ఉన్నాయని, స్థానిక రెవెన్యూ నిబంధనల ప్రకారమే మార్పులు జరిగాయని భావిస్తోంది. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం తన తదుపరి వాదనలను కోర్టులో వినిపించాల్సి ఉంది. గతంలో కొందరు పిటిషన్లు వేసి ఉపసంహరించుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటంతో, ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది.4,000 కోట్ల విలువైన భూమి కావడం, ఇందులో ఒక ఆధ్యాత్మిక ట్రస్ట్, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వామ్యం కావడంతో ఈ కేసు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది. హైకోర్టు ఇచ్చే తీర్పు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల పంపకాల వివాదాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# సీబీఐ కీలకం

కడప, జనవరి 21, వైఎస్ వివేకానంద రెడ్డిహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది.. సిబిఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసినట్లు చెప్పిన నేపథ్యంలో కొన్ని రకాల అనుమానాలు వ్యక్తం చేస్తూ వైయస్ సునీత ఇదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని సూచించడంతో ఆమె కింది కోర్టును ఆశ్రయించారు. అయితే ఆమె లేవనెత్తిన అనుమానాలు, ఆపై నిందితులుగా భావిస్తున్న వారిని విచారించకుండానే సిబిఐ దర్యాప్తు పూర్తి అవ్వడాన్ని ప్రస్తావించారు. కానీ కింది కోర్టు అవేవీ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మళ్లీ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈరోజు విచారణ జరగగా కోర్టు ఆసక్తికరమైన అంశాలను సిబిఐ ని అడిగి తెలుసుకుంది. వచ్చేనెల ఐదుకు విచారణను వాయిదా వేసింది.ప్రధానంగా ఈ కేసులో దర్యాప్తు పూర్తిస్థాయిలో ముగిసింది అని సిబిఐ కోర్టుకు చెబితే.. సుప్రీంకోర్టు ఈ కేసును ఒక కొలిక్కి తెచ్చే అవకాశం ఉంది. సిబిఐ దర్యాప్తు పూర్తిగా జరిగిందా? ఇంకేమైనా దర్యాప్తు చేయాల్సి ఉందా? అని అడిగింది కోర్టు. అయితే సునీత మాత్రం జగన్మోహన్ రెడ్డి దంపతులకు ముందుగానే ఎలా తెలిసింది అనేది సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అదే కీ పాయింట్ అని చెప్పుకొచ్చారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారని జగన్మోహన్ రెడ్డి దంపతులకు ఎవరు చెప్పారు అన్నది సునీత సందేహం. రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందని ఆమె ఆది నుంచి సందేహం వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలతో ట్రైల్ కోర్టుకు సునీత రాగా.. అందరూ కుటుంబ సభ్యులు కావడం వల్లే సమాచారం ఇచ్చి ఉంటారని కోర్టు అభిప్రాయ పడింది. అయితే దీనితో ఏకీభవించలేదు సునీత. అందుకే మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# వెడ్డింగ్ హబ్ గా తిరుపతి

తిరుపతి, జనవరి 21, కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు భావించే వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల లో వివాహం చేసుకోవడం అత్యంత పవిత్రమని చాలామంది విశ్వసిస్తారు. ఆ పవిత్ర వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభిస్తే దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా సాగుతుందని భక్తుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వివాహ జీవితానికి శుభకారకమని భావిస్తారు. ఏడుకొండల వాడి సన్నిధిలో జరిగే పెళ్లిని ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గౌరవిస్తారు.ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమల?తిరుపతి ప్రాంతాన్ని వివాహాల కోసం ప్రత్యేక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లె కు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పర్యాటక శాఖ కలిసి ప్రత్యేక ప్యాకేజీపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తిరుమలలో ఏటా సుమారు పదిహేను వేల నుంచి ఇరవై వేల వరకు వివాహాలు జరుగుతున్నాయి. శుభ ముహూర్తాలు ఉన్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తిరుపతి , తిరుచానూరు ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లు వీటికి అదనమే.ఇప్పటికే టీటీడీ వివాహాలు చేసుకునే జంటలకు కొన్ని సౌకర్యాలు అందిస్తోంది. 'కళ్యాణ వేదిక' లో వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక దర్శన అవకాశం, ఆశీర్వచన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు ఉన్నాయి. అయితే ఈ వేదికలో ఆర్భాటాలకు అవకాశం తక్కువగా ఉండటంతో, కొందరు భక్తులు కొండపై ఉన్న ప్రైవేటు మఠాలు, సత్రాలు లేదా దిగువ ప్రాంతాల్లోని కల్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. తొండవాడ , శ్రీనివాసమంగాపురం వంటి ప్రాంతాలు కూడా పెళ్లిళ్లకు ప్రాధాన్యం పొందుతున్నాయి.అయితే ఈ విధంగా ఇతర చోట్ల వివాహాలు చేసుకునే వారికి ఇప్పటివరకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అంశం ప్రభుత్వ దృష్టికి రావడంతో, ఇకపై కళ్యాణ వేదిక వెలుపల పెళ్లి చేసుకున్నా కూడా శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించే విధంగా కొత్త విధానం తీసుకురావాలని యోచిస్తోంది.

## దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21-నంద్యాల పట్టణంలోని మున్సిపల్ పార్కులో ఉన్న ఆయుష్ యోగా కేంద్రంలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాలతో పాటు కర్నూలు, ఆదోని, అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం ప్రాంతాలకు చెందిన 98 మంది అర్హులైన దివ్యాంగులకు సుమారు 12 లక్షల రూపాయల విలువ గల కృత్రిమ అవయవాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ, దివ్యాంగులకు సేవ చేయడం సమాజం యొక్క బాధ్యత అని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని, అవసరమైన ప్రతి చోట సహకారం అందించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఈ కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు. భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు ఖండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ, దివ్యాంగుల కష్టాలను దగ్గర నుంచి గమనించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. జీ. రాకృష్ణారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహానందీశ్వర స్వామి సన్నిధిలో రైల్వే జీఎం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21-నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో శ్రీ మహానందీశ్వర స్వామివారిని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రైల్వే ఉన్నతాధికారులు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు తెలిపారు. మహానంది క్షేత్ర ఆధ్యాత్మిక విశిష్టత, భక్తుల సౌకర్యాలపై అధికారులతో స్వల్పంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, రైల్వే ప్రతినిధులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో డ్రైనేజీ పనుల తనిఖీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21-నంద్యాల పట్టణంలోని 20వ వార్డులో డ్రైనేజీ కాలువల్లో పూడిక తీత పనులను మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న బుధవారం పరిశీలించారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పూడిక తీసే పనుల నిమిత్తం 30 మందిని డైలీ వేతనం కింద నియమించినట్లు కమిషనర్ తెలిపారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం లలితా నగర్‌లో ఇంటింటా పర్యటించిన కమిషనర్, మున్సిపల్ నీరు సక్రమంగా అందుతోందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటి పన్ను, కొలాయి పన్నులు చెల్లిస్తున్నారా లేదా అనే విషయాలపై సమాచారం సేకరించారు. డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం తదితర పలు సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కమిషనర్ వెంట ఉన్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని కమిషనర్ బి. శేషన్న తెలిపారు.



## సూర్య ఘర్ తో జిల్లా అభివృద్ధి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21:-ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా నంద్యాల జిల్లాను గ్రీన్ ఎనర్జీ జిల్లాగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయనంద్ కు తెలిపారు. మంగళవారం



అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో పీఎం కుసుం, పీఎం సూర్య ఘర్ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో నంద్యాల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ట్రాన్స్కో అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద 22,590 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఇళ్లపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసి వచ్చే జూన్ మాసం లోపు అమలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అవగాహన కల్పించి ప్రతి ఇంటిపై సోలార్ వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అలాగే నంద్యాల జిల్లాలో 116 ఎకరాల్లో పీఎం కుసుం ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 12 ఎకరాలు ప్రభుత్వ భూమి, 104 ఎకరాలు ప్రైవేటు భూమిగా గుర్తించామని, ఎటువంటి భూ సమస్యలు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## నేటి నుండి 26.01.2026 వరకు సూర్య దేవాలయంలో సూర్యనారాయణ స్వామికి సప్తమ వార్షిక మహోత్సవాలు..



విభారే న్యూస్ జనవరి 21 కర్నూలు జిల్లా ప్రతినిధి..సప్తమ వార్షిక రథ సప్తమి మహోత్సవఆహ్వానంశ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి యొక్క ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామివారి సప్తమవార్షిక మహోత్సవం లో భాగంగ 22- 1- 2026 గురువారము నుండి26- 1- 2026 సోమవారం వరకునిర్వహించబడును22- 1- 2026 తేదీ 9:00గం లకు గోపూజ గణపతి పూజ పుణ్యాహవాచనం రక్షాబంధనం ప్రధాన కలశ స్థాపన 11.30 గ లకు గణపతి హోమం, ప్రధాన దేవతా హోమము నిర్వహించబడును కావున భక్త మహాశయులందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ సూర్యనారాయణ స్వామి వారి యొక్క అనుగ్రహానికి పాత్రులవుతారని కోరుకుంటున్నాం.

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం

### నూతన డిసిసిగా బాధ్యతలు చేపట్టిన బోయ క్రాంతి నాయుడు



విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధి. జనవరి 21 రాహుల్ గాంధీ ని ప్రధాని చేయడమే మా లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులు బి క్రాంతి నాయుడు అభిప్రాయపడ్డారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ ఈ రోజు నా జీవితంలో మరపురాని రోజు అని నా చదువు పూర్తయి ఉద్యోగం వచ్చినపుడు కూడా ఇంత సంతోష పడలేదని నా మీద ఎంత బాధ్యత ఉందో నాకు అర్థం అవుతుందని అందరి నాయకుల సహకారంతో నియోజకవర్గాలకు సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా నందలి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించిన కేంద్ర మరియు రాష్ట్ర కమిటీ పరిశీలకులు అధ్యయనం చేసి అధినాయకుల అభిప్రాయం తీసుకొని నన్ను డిసీసీ అధ్యక్షులుగా నియమించడం జరిగిందని వయసులో చిన్నవాడినైనా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవ చేశానని విద్యార్థి నాయకుడిగా, యూనివర్సిటీ అధ్యక్షునిగా కొన్ని సంస్థలు నిర్వహిస్తూ అన్ని విధాలుగా పోరాటాలు చేశానని జిల్లాలో ప్రతి సమస్య పైన గొంతు విప్పిన వాడిని అధికార ప్రతిపక్షాలకు కాంగ్రెస్ పార్టీ గళం వినిపించామని జిల్లా అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, పేద ప్రజలు సొంత గృహాలలో నివసిస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసుకుంటున్నారు అంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ కృషి ఫలితమేనని కర్నూలు జిల్లా కరువు ప్రాంతం ప్రజలు వలస వెళ్తారని పొలాలు ఉన్న పంటలు పండక వలసలు వెళ్లిన గ్రామాలు ఉన్నాయని వలసల పైన కాంగ్రెస్ పార్టీ తరపున గళం విప్పామని తాగునీరు, సాగునీరు, రోడ్లు, విద్యుత్ ఇవన్నీ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులేనని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన శాశ్వత పనులను అడ్డుపెట్టుకొని కొన్ని పార్టీలు మనుగడ సాగిస్తున్నాయని రాష్ట్రానికి బిజెపి చేసింది ఏమీ లేదని గతంలో కాంగ్రెస్ కార్యాలయం ఎలా కళకళలాడిందో ప్రస్తుతం కళా వెంకట్రావు భవనం ప్రజా భవనంలా పనిచేస్తుందని ప్రజా సమస్యలపై కమిటీలు వేసి అవి పరిష్కారం అయ్యే విధంగా కార్యాలయం పనిచేస్తుందని పదవులు ఉన్న ప్రతి ఒక్కరికి బాధ్యతగా పనిచేసి పదవులకు న్యాయం చేయాలని ప్రతి నియోజకవర్గములో పర్యటిస్తానని ప్రతినెల సర్వసభ్య సమావేశం మరుసటి నెల కార్యవర్గ సమావేశాలు ఏర్పాటు చేస్తామని కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ నాయకులను రప్పిస్తామని కర్నూలు జిల్లా నాయకులు తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమంటే మీ మద్దతు నాకుంటే నా మద్దతు మీకు ఉంటుందని ఎవరైనా గీత దాటితే అధిష్టానం నిర్ణయం మేరకు వేటు తప్పదని కేంద్రంలో నాయకులు ఎలా పోరాడుతున్నారో మన జిల్లాలో మనం పోరాడి రాహుల్ గాంధీ ని ప్రధాని చేసుకోవాలని ఆ పోరాటంలో భాగస్వాములు కావాలని లేదంటే చర్యలు తప్పవని నేను పనిచేస్తా మీరు పని చేయాలని ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుంటానని, సూచనలు సలహాలు తీసుకుంటానని అలాగే ప్రజల సలహాలు తీసుకుంటామని ప్రతి గురువారం ప్రజా ఫిర్యాదుల వేదిక ఏర్పాటు చేసి లీగల్ సెల్ కమిటీలు వేస్తామని ఒక ఎజెండా ప్రకారం విద్య ఉపాధి నిరుద్యోగ పరిశ్రమల నీరు ఆరోగ్య సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఉపాధి హామీ పథకం పై అధిష్టానం నిర్ణయం మేరకు గ్రామస్థాయి నుండి పోరాటాలు సిద్ధం చేశామని మీ అందరి మద్దతు అవసరమని వచ్చే ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకుందామని త్వరలో జరుగుతున్న స్థానిక సంస్థలు ఎన్నికలలో జిల్లాలోని అన్ని ఎంపిటిసి జడ్పిటిసి స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెడతామని సాధ్యమైనంత వరకు సర్పంచ్లను వార్డు మెంబర్లను నిలబెడతామని నాకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదములు తెలియజేస్తున్నానని క్రాంతి నాయుడు తెలియజేశారు. ముందుగా నూతన డిసిసి క్రాంతి నాయుడు నగరంలోని జాతీయ విగ్రహం జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా పార్టీ కార్యాలయమునకు విచ్చేసి కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా షేక్ జిలాని భాష పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమమునకు తెలంగాణ రాష్ట్ర గద్వాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ కె రాజీవ్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేయడమైనది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప,మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు,



కోఆర్డినేటర్లు ఎం కాశీం వలి, అనంతరత్నం మాదిగ ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సీ బజారన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు వై మారుతీ రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి మహేంద్ర నాయుడు, ఓబిసిడి జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, కేకేసి సెల్ చైర్మన్ ఎజాజ్ అహ్మద్ పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వెంకటన్న, దేవిశెట్టి ప్రకాష్, పోతుల శేఖర్, రియాజుద్దీన్, దిలీప్ దూక, చంద్రశేఖర్ ,జాన్ సదానందం, సయ్యద్ నవీద్, అబ్దుల్ భాయ్ శేషయ్య ఆనందం ఆశీర్వాదం దస్తగిరి మొదలగువారు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు క్యాలెండర్ ఆవిష్కరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా గారు బుధవారం కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అనే ప్రభుత్వ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ గ్రామాలు, వార్డులను పరిశుభ్రంగా, సుందరంగా అభివృద్ధి చేయడంలో స్వర్ణ గ్రామం?స్వర్ణ వార్డు కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కోఆర్డినేటర్ ఖాదర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో అరకు కాఫీ స్టాల్ ప్రారంభం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21:అరకు కాఫీని ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్ ఆవరణంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్‌లతో కలిసి అరకు కాఫీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో ప్రతి కలెక్టర్ కార్యాలయంలో స్టాల్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ అరకు కాఫీ ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ప్రజలు విస్తృతంగా వినియోగించి ప్రోత్సహించాలని కోరారు. డిఆర్డిఏ, హార్టికల్చర్ శాఖల సహకారంతో స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## నంద్యాలలో అయోధ్య రామ మందిర నమూనా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 21-నంద్యాల మరియు చుట్టుప్రక్కల గ్రామ ప్రజలకు అపూర్వమైన దైవ దర్శనావకాశం లభించింది. నంద్యాల పట్టణంలో తొలిసారిగా శ్రీ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థాన ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌లో శ్రీ అయోధ్య రామ మందిరం అద్భుత నమూనాను భక్తుల దర్శనార్థం ఉంచారు. భారతదేశ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన అయోధ్య శ్రీ రామ మందిరాన్ని అచ్చుగుద్దినట్టుగా ప్రతిబింబించే ఈ నమూనా భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అత్యంత నిశితంగా నిర్మించిన ఈ నమూనా ద్వారా అయోధ్య రామ మందిర వైభవాన్ని నంద్యాలలోనే వీక్షించే అరుదైన అవకాశం లభిస్తోంది. ఈ ఎగ్జిబిషన్‌కు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల ముప్పై నిమిషాల వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శ్రీనివాస చౌదరి వెల్లడించారు. దైవ భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా రూపొందించిన ఈ అయోధ్య రామ మందిర నమూనా ప్రదర్శనను ప్రతి ఒక్కరూ వీక్షించి దైవానుగ్రహం పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190